సాక్షి
అనకాపల్లి

బుధవారం । 8 । ఫిబ్రవరి । 2023



చెరకు రైతులకు మేలు చేసేలా..

చెరకు రైతులకు మేలు జరిగే విధంగా పలు రకాల పరిశోధనలు చేస్తున్నట్టు సోలాపూర్ శాస్త్రవేత్తలు తెలిపారు. 10లో



క్లీన్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా..

క్లీన్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరుతో కార్యక్రమాలు చేపట్టింది. 10లో

వాతావరణం

అనకాపల్లిటౌన్ : రాగల ఐదు రోజులు వాతావరణం మేఘావృతమై ఉంటుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త కుమారి తెలిపారు. ఉష్ణోగ్రతలు 31.4 నుంచి 32.3 డిగ్రీలు, గాలిలో తేమశాతం 74 నుంచి 77, గాలి గంటకు 7 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

జేసీ దృష్టికి పల్లపు ఆనందపురం వివాదం

మునగపాక: మండలంలోని పల్లపు ఆనందపురం సచివాలయ వివాదం జేసీ దృష్టికి వెళ్లింది. కొంతకాలంగా ఎంపీటీసీ కర్రి సంజీవిని, పంచాయతీ కార్యదర్శి సమీహ మధ్య వివాదం జరుగుతోంది. దీనిలో భాగంగా ఈ నెల 6న పల్లపు ఆనందపురం సచివాలయానికి సంజీవిని తాళం వేయడంతో వివాదం మరింత ముదిరింది. కార్యదర్శి సమీహను లోపల ఉంచి తాళం వేసిన విషయం తెలుసుకున్న జేసీ కల్పనాకుమారి స్పందించారు. మంగళవారం మునగపాక ఎంపీడీవో రవికుమార్‌ను పిలిపించి వివాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై విచారణ జరిపేందుకు కమిటీని నియమిస్తామని కల్పనాకుమారి తెలిపినట్టు రవికుమార్ తెలిపారు.

హెచ్‌ఐవీ రోగులకు హెపటైటిస్‌-బి టీకా



హెపటైటిస్‌-బి టీకా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

అనకాపల్లిటౌన్ : హెచ్‌ఐవీ రోగులకు హెపటైటిస్‌-బి వ్యాధి సోకే అవకాశముందని జిల్లా డీఎంహెచ్‌వో హేమంత్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో మంగళవారం హెపటైటిస్‌-బి నుంచి రక్షణ పొందడంపై రూపొందించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఈ టీకా 6 నెలలపాటు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శారదాబాయి, ఆర్‌ఎంవో భారతి, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నుంచి శరగడం సస్పెన్షన్

సాక్షి, అనకాపల్లి : వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గానికి చెందిన శరగడం చినఅప్పలనాయుడును పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వుల్లో పేర్కొంది.

సముద్రంలో యువకుడి గల్లంతు



రిత్విక్

పాయకరావుపేట: మండలంలోని పెద్దూరు సముద్ర తీరంలో స్నానం చేస్తుండగా ఓ యువకుడు గల్లంతైనట్టు ఎస్‌ఐ బి.జోగారావు తెలిపారు. కాకినాడ మధురానగర్‌కి చెందిన గుమ్మడి రిత్విక్ (24) సోమవారం సాయంత్రం సముద్ర స్నానానికి స్నేహితులతో వెళ్లాడు. స్నానం చేస్తుండగా అలల తాకిడికి మునిగిపోయినట్టు ఎస్‌ఐ తెలిపారు. రిత్విక్ బీటెక్ చదువుతున్నాడని, రిత్విక్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

11న అండర్‌-17 చెస్ పోటీలకు ఎంపిక

అనకాపల్లిటౌన్: స్థానిక సాయిశక్తి టెక్నో స్కూల్ ఆవరణలో ఈ నెల 11న రాష్ట్రస్థాయి అండర్‌-17 బాలబాలికల చదరంగం పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్టు జిల్లా టోర్నమెంట్ ఇన్‌చార్జి ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. 17 ఏళ్ల కంటే తక్కువ వయసున్న బాలలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆంధ్రా చెస్‌లో బాలబాలికల పేర్లు రిజిస్టర్ అయి ఉండాలన్నారు. ఈనెల 10వతేదీలోగా 9866846146, 7032562545 నంబర్లలో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపిక తర్వాత అండర్‌-9, 11, 13, 15 విభాగాల్లో జిల్లాస్థాయి చెస్‌పోటీలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

15న జీవీఎంసీ ప్రత్యేక బడ్జెట్ సమావేశం

డాబాగార్డెన్స్(విశాఖపట్నం): 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీవీఎంసీ ప్రత్యేక బడ్జెట్ సమావేశం ఈనెల 15న జరగనుంది. ఇప్పటికే స్థాయీ సంఘం సభ్యుల ఆమోదం పొందిన బడ్జెట్‌నుకౌన్సిల్ సభ్యుల దృష్టికి తీసుకువచ్చేందుకు బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నారు. 2023–24 ఏడాదికి సంబంధించి రూ.4,063 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించారు. గత ఏడాది బడ్జెట్ సవరణతో పాటు, కొత్త బడ్జెట్‌పై పాలకవర్గ సభ్యులకు తెలియజేయనున్నారు. రూపొందించిన బడ్జెట్‌లో రూ.3,822.62 కోట్లు జీవీఎంసీకి జమగా చూపారు.

అయ్యన్న ఇలాకాలో అసమ్మతి గంట



- నర్సీపట్నం టీడీపీలో గ్రూపు రాజకీయాలు
- మాజీ ఎమ్మెల్యే ముత్యాలపాప, యర్రాపాత్రుడు అసమ్మతి రాగం
- రెండు రోజుల కిందట జాతర పేరిట బలప్రదర్శన
- జిల్లా వ్యాప్తంగా పలువురు టీడీపీ నేతలకు ఆహ్వానం

సాక్షి, అనకాపల్లి: అసలే నర్సీపట్నం నియోజకవర్గంలో టీడీపీ పాతాళంలోకి కూరుకుపోయింది. దానికి తోడుగా ఇప్పుడు గ్రూపు రాజకీయాలు తోడయ్యాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో తనకు తిరుగు లేదని చెప్పుకునే మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు అయ్యన్నపాత్రుడికి సొంత నియోజకవర్గంలో వ్యతిరేక వర్గం తయారైంది. ఇప్పటికే నియోజకవర్గంలో పట్టు కోల్పోయిన ఆయన కుటుంబానికి ఎలా సీటు ఇస్తారంటూ..అక్కడ టీడీపీ నేతలు అధిష్టానాన్ని అడిగినట్టు సమాచారం. ఇటీవల తనకు చిరకాల రాజకీయ ప్రత్యర్థి, మరో మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత విషయంలో మీడియా ముందు అయ్యన్న నోరు జారడంతో ఆయన జోక్యంతోనే నర్సీపట్నంలో అసమ్మతి రాజుకుంటున్నట్టు వినిపిస్తోంది. ఇటీవల రెండు రోజుల క్రితం మాకవరపాలెం మండలం బూరుగుపాలెం గ్రామంలో జరిగిన గ్రామ దేవత పండగలో నర్సీపట్నం నియోజకవర్గ టీడీపీలో గ్రూపు రాజకీయాలు బట్టబయలయ్యాయి. పండగ పేరుతో టీడీపీ సీనియర్ నేత రుత్తల యర్రాపాత్రుడు తన ఇంటికి టీడీపీ నేతలను ఆహ్వానించి బలప్రదర్శన చేశారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో టీడీపీ సీనియర్ నేతలు హాజరయ్యారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి, మాడుగుల నియోజకవర్గానికి చెందిన పైలా ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే ముత్యాలపాప, జెడ్పీటీసీ సుకల రమణమ్మ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. అయ్యన్నకు వ్యతిరేక వర్గం వారంతా అక్కడ ప్రత్యక్షమవడం, అయ్యన్నపాత్రుడు, ఆయన వర్గం ఎక్కడా కనిపించకపోవడంతో వర్గపోరు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని పరిశీలకులు చెబుతున్నారు.

అప్పుడు సహకరించిన వారే..

2009లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన బోళెం ముత్యాల పాప, 2014 సార్వత్రిక ఎన్నికల్లో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని టీడీపీకి అనుకూలంగా పనిచేశారు. తన బంధువర్గం ఓట్లను టీడీపీకి వేయించడంతో నర్సీపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ స్వల్ప తేడాతో ఓటమి చెందారు. అనంతరం బోళెం ముత్యాలపాప టీడీపీలోకి చేరారు. భవిష్యత్తులో తనకు నర్సీపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పిస్తారని హామీరావడంతో టీడీపీకి అనుకూలంగా పనిచేశానని సన్నిహితుల వద్ద ఆమె పలుమార్లు చెప్పినట్టు సమాచారం. 2014లో పరోక్షంగా..2019 ఎన్నికల్లో ప్రత్యక్షంగా టీడీపీకి మద్దతుగా పనిచేసిన ఆమె ఇప్పుడు నర్సీపట్నం టికెట్ కోసం యత్నిస్తున్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో నాతవరం, నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల్లో తన బంధువర్గం ఎక్కువగా ఉన్నందున తనకు టికెట్ ఇస్తే విజయం సాధిస్తానని ఆమె చెబుతున్నారు. టీడీపీలో మరో సీనియర్ నేత రుత్తల ఎర్రాపాత్రుడుతో కలసి ఈసారి ఎమ్మెల్యే సీటుపై గురిపెట్టారు. ఒక వైపు మాజీ ఎమ్మెల్యే ముత్యాలపాప, మరో వైపు ఎర్రాపాత్రుడు కూడా ఎమ్మెల్యే సీటు కోసం ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నట్టు సమాచారం. ఇద్దరిలో ఎవరికీ వచ్చినా ఇద్దరం కలిసి చేద్దామనే ఒప్పందం కూడా వారు కుదుర్చుకున్నట్టు భోగట్టా. అయ్యన్నకు కాకుండా నర్సీపట్నం సీటు తమలో ఎవరో ఒకరికి దక్కేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఓ టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి వీరిని నడిపిస్తున్నట్టు భోగట్టా.

బల నిరూపణ...

ఎప్పటి నుంచో ఎమ్మెల్యేగా పనిచేయాలనే ఆశతో ఉన్న టీడీపీ సీనియర్ నాయకుడు రుత్తల ఎర్రాపాత్రుడు, ఓ మాజీ మంత్రి ప్రమేయంతో అయ్యన్నకు వ్యతిరేక వర్గం తయారు చేస్తున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల రెండు రోజుల క్రితం తన గ్రామంలో గ్రామ దేవత పండగ పేరిట జిల్లాలో టీడీపీ సీనియర్ నేతలను, నియోజకవర్గంలో టీడీపీ నాయకులను రుత్తల ఎర్రాపాత్రుడు పెద్ద భారీ ఎత్తున ఆహ్వానించారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి హాజరయ్యారు. మరో మాజీ మంత్రి చివరి క్షణంలో హాజరు కాలేదు. నర్సీపట్నం నియోజకవర్గంలో అయ్యన్నపాత్రుడుతో పాటు ఆయన అనుచరగణంలో ఎవరూ హాజరు కాలేదు. అయ్యన్నపాత్రుడు వ్యతిరేకవర్గంగా ఉన్న టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.ఈ పరిణామాలపై నర్సీపట్నం నియోజకవర్గంలో పెద్ద చర్చ జరుగుతోంది.



పండగలో ముత్యాలపాప, యర్రాపాత్రుడు



జాతరకు హాజరైన బండారు

భారతీయ సంస్కృతి భిన్నమైనది

అమెరికా ప్రొఫెసర్ చార్లెస్ నుకోల్స్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ నుకోల్స్

చోడవరం రూరల్: భారతీయ సంస్కృతి ప్రపంచ సంస్కృతులన్నింటా భిన్నమైనదని, ఉత్తమ విలువలతో కూడుకున్నదని అమెరికాలోని ప్రఖ్యాత బ్రిగమ్ యంగ్ యూనివర్సిటీ ఆంత్రోపాలజీ ప్రొఫెసర్ చార్లెస్ నుకోల్స్ అభివర్ణించారు. అంతేగాకుండా గాంధీ సిద్ధాంతాలే ఆధునిక సమాజానికి భారతదేశం మార్గదర్శిగా నిలవడానికి అర్హత ఇచ్చాయని, దానిని కాపాడుకోవలసిన బాధ్యత భారత ప్రజలపై ఉందని స్పష్టం చేశారు. దక్షిణ భారతదేశ గ్రామ సంస్కృతుల పట్ల పరిశోధన చేస్తున్న ప్రొఫెసర్ నుకోల్స్ తన పర్యటనలో భాగంగా మంగళవారం చోడవరానికి చేరుకున్నారు. విశ్రాంత ఉపకులపతి ముర్రు ముత్యాలునాయుడు ప్రోత్సాహంతో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఐక్యూఏసీ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులు, లెక్చరర్లకు ప్రత్యేక ఉపన్యాసం ఏర్పాటు చేశారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టత తనను ఆకట్టుకున్నట్టు ఆయన చెప్పారు. ఆచార్య ముర్రు ముత్యాలునాయుడు మాట్లాడుతూ అమెరికన్ పరిశోధకులు మన దేశ సంస్కృతి, ఔన్నత్యాన్ని పొగుడుతుంటే, మనం విదేశీ ఆర్భాటాల కోసం వెంపర్లాడుతూ సహజ సంస్కృతిని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్ మాట్లాడుతూ నుకోల్స్ పర్యటన కళాశాల చరిత్రలో ఒక ముఖ్య ఘట్టమని అంటూ.. ఇదే తేదీన భారత్, అమెరికా దేశాల మధ్య చారిత్రక ఒప్పందం కుదిరిందని, ఇది కాకతాళీయమే అయినా మరపురానిదన్నారు. ఐక్యూఏసీ కేంద్రం సమన్వయకర్త జి.వి.వి.ఎస్.వి.ప్రసాద్ బాబు నిర్వహణలో ప్రతిభగల విద్యార్థులకు బహుమతులు అందచేశారు. సమావేశంలో వివిధ కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో లక్ష్మీశౌర్య ప్రతిభ



తల్లిదండ్రులు అక్కతో లక్ష్మీశౌర్య



లక్ష్మీశౌర్య



ఎన్.సూర్యచరణ్



ఎస్.అశోక్



జి.శిరీష

చోడవరం రూరల్/మాడుగుల రూరల్ : తల్లి సాధారణ గృహిణి, తండ్రి వ్యవసాయంతో పాటు చిన్నపాటి కలప వ్యాపారం చేస్తుంటాడు. అయితేనేమి చదువులో తాను ఆణిముత్యమని నిరూపించాడు ఆ గ్రామీణ విద్యార్థి. తన అక్క మెడిసిన్‌లో ఉత్తమ ర్యాంకుతో ఆంధ్రా మెడికల్ కళాశాలలో సీటు సాధించడాన్ని స్ఫూర్తిగా తీసుకుని తాను ఇంజనీరింగ్‌లో దేశ వ్యాప్తంగా మెరుగైన ఫలితాన్ని సొంతం చేసుకున్నాడు. వి.మాడుగుల మండలం కస్పా జగన్నాథపురానికి చెందిన కాళ్ల చినఅప్పలనాయుడు, ఉదయశ్రీ దంపతులు ప్రస్తుతం చోడవరం పట్టణ పరిధిలోని మారుతీనగర్‌లో నివసిస్తున్నారు. వీరి కుమారుడు లక్ష్మీశౌర్య 2023 విద్యాసంత్సరానికి జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ)లో బీటెక్ ప్రవేశ పరీక్షలో ఎన్‌టీఏ స్కోర్ 99.96 సాధించి సత్తా చాటాడు. లక్ష్మీశౌర్య పాఠశాల స్థాయి నుంచే చదువులో ముందుండేవాడు. దీంతో గుంటూరులోని భాష్యం విద్యాసంస్థలో ఆరో తరగతిలో చేర్పించారు. అదే సంస్థలో ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఐఐటీలో చేరి ఇంజినీరింగ్ చేయాలన్న తన లక్ష్య సాధనకు జేఈఈ ఎంట్రెన్స్‌లో 99.9616260 ఎన్‌టీఏ స్కోర్‌ను సాధించాడు. జాతీయస్థాయిలో జనరల్‌లో 100లోపు ర్యాంకు ఉంటుందని అంచనా. తన అక్క లక్ష్మీ హర్షిణి ఎంబీబీఎస్‌లో మంచి ర్యాంకుతో విశాఖ ఆంధ్రా మెడికల్ కళాశాలలో సీటు సాధించిందని, ఆ స్ఫూర్తితోనే తాను కూడా మంచి ర్యాంకుతో ఐఐటీ సీటు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని చదివినట్టు తెలిపాడు. లక్ష్మీశౌర్యను విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు అభినందించారు.

శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

పాయకరావుపేట: జేఈఈ మెయిన్స్ ఫేజ్‌–1 ఫలితాల్లో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్.సూర్యచరణ్ 99.69, ఎస్.అశోక్ 96.79, జి.శిరీషా 96.79 పర్సంటైల్‌తో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ఎస్ భానుమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో జేఈఈ మెయిన్స్ కోసం ఇస్తున్న ఇంటిగ్రేటెడ్ కోచింగ్ ద్వారా ఈ విజయాన్ని సాధించారని పేర్కొన్నారు. తమ విద్యార్థుల్లో 10 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకి అర్హత పొందినట్టు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సంస్థ అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సహచర విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

వాహనాల మంజూరుకు దివ్యాంగులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న జేసీ కల్పనాకుమారి

తుమ్మపాల: దివ్యాంగులకు ప్రభుత్వం ఉచితంగా మూడు చక్రాల మోటారు వాహనాలను అందించనుంది. నిరుపేదలై పదవ తరగతి ఆపై విద్యార్హత కలిగిన వారికి ఈ వాహనాలు అందించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. వీటి కోసం దరఖాస్తు చేసుకున్న పలువురికి స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జేసీ కల్పనాకుమారి మాట్లాడుతూ అర్హులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. దివ్యాంగులకు ఉచితంగా మోటారు వాహనాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. జిల్లాలో మొత్తం 152 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇంటర్వ్యూలకు 132 మంది హాజరయ్యారని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంస్థ ఏడీ జి.బి.బి.జగదీష్ తెలిపారు. వీరిలో అర్హులకు వాహనాలు మంజూరు చేస్తామని చెప్పారు. నియోజకవర్గానికి 10 మందికి చొప్పున వాహనాలు ఉచితంగా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి టి.అజయ్‌బాబు, రవాణా, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా..



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

- అందరూ సమన్వయంగా పనిచేయాలి
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపు

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు అందరూ కృషి చేయాలని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మద్దిలపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతి నియోజకవర్గంలో సచివాలయాల వారీగా పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహించి, ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. బుధవారం నుంచే ప్రతి నియోజకవర్గంలో ఆయా ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు సమావేశాలు ప్రారంభించాలన్నారు.

వార్డు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను త్వరితగతిన నియమించాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల పార్టీల అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు, కరణం ధర్మశ్రీ, మజ్జి చిన్న శ్రీను, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొల్ల బాబూరావు, అన్నంరెడ్డి అదీప్ రాజ్, యు.వి.రమణమూర్తిరాజు, బొత్స అప్పలనర్సయ్య, కడుబండి శ్రీనివాసరావు, కంబాల జోగులు, నియోజకవర్గ సమన్వయకర్తలు కె.కె.రాజు, ఆడారి ఆనంద్, అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, జగనన్న సచివాలయ కన్వీనర్ల ఉత్తరాంధ్ర కన్వీనర్ హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు అమృత్ సరో 'వరం'

- అభివృద్ధికి అధికారుల చర్యలు
- జిల్లాలో మొదట విడతగా 137 చెరువుల ఎంపిక
- ఒక్కోదానికి రూ. 15లక్షల ఉపాధి నిధులు
- ఇంతవరకు 40 పైగా అభివృద్ధి
- మిగతావి ఆగస్టులోగా పూర్తి

నాతవరం: అమృత్ సరోవర్ పథకంతో చెరువులకు మహర్దశ పట్టింది. ఏళ్లతరబడి ఆక్రమణలకు గురై అధ్వాన్నంగా ఉన్న చెరువుల రూపురేఖలు మారి, సుందరంగా దర్శనమిస్తున్నాయి. జిల్లాలోని 24 మండలాల్లో మొదట విడతగా 137 చెరువులను అభివృద్ధి చేస్తున్నారు. ఒక్కో చెరువుకు రూ.15 లక్షల చొప్పున ఉపాధి హామీ పథకం నిధులు కేటాయించారు. ఈ నిధులతో పూడిక తీత, గట్టు పటిష్టం చేయడంతో పాటు పాడైన కాలువలు, మదుములకు మరమ్మతులు చేస్తున్నారు. జిల్లాలో ఇంతవరకు 40 పైగా చెరులను అభివృద్ధి చేశారు. ఈ చెరువులు ఇప్పుడు జలంతో కళకళలాడుతున్నాయి.

ఆక్రమణల తొలగింపు

ఒక వైపు మరమ్మతులు చేయడంతో పాటు మరో వైపు తహసీల్దార్ల సమక్షంలో సర్వే చేసి చెరువుల్లో ఆక్రమణలను తొలగిస్తున్నారు. భవిష్యత్‌లో ఆక్రమణలకు గురికాకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అమృత్ సరోవర్ పథకంలో అభివృద్ధి చేసిన నాతవరానికి సమీపంలో ఉన్న చీడిపల్లి కొండయ్య చెరువులో ఇప్పుడు నీరు పుష్కలంగా ఉంది. ఇది ఈ ప్రాంత పశువులతో పాటు రైతులకు అన్ని విధాలుగా ఉపయోగపడుతోంది.



అభివృద్ధి చేసిన చీడిపల్లి కొండయ్య చెరువు

పంచాయతీలకు ఆదాయం

అభివృద్ధి చేసిన చెరువుల చుట్టూ కొబ్బరి, నీడనిచ్చే మొక్కలు వేశారు. దీంతో పరిసర ప్రాంతాలు ఆహ్లాదంగా దర్శనమిస్తున్నాయి. చెరువుల్లో నీరు పుష్కలంగా నిల్వ ఉండడంతో చేపల పెంపకం కూడా చేపడుతున్నారు. పొలాలకు నీరు సరఫరా చేయడంతో పాటు పంచాయతీలకు ఆదాయం లభించేలా చర్యలు తీసుకున్నారు.



గట్టుపై వేసిన నీడనిచ్చే మొక్కలు

ఆగస్టులోగా చెరువులన్నీ అభివృద్ధి చేస్తాం



అమృత్ సరోవర్ పథకంలో మొదటి విడతలో ఎంపిక చేసిన చెరువులన్నింటినీ ఆగస్టులోగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నాం. ఇంత వరకు 40పైగా చెరువులను అభివృద్ధి చేశాం. నాతవరంలో అభివృద్ధి చేసిన చెరువును చూసి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో చెరువు గట్టుపై మొక్కలు కూడా వేస్తున్నాం.

– ఎం.రోజారాణి, ఎన్ఆర్ఈజీఎస్, అడిషనల్ ప్రాజెక్టు అధికారి

ఆక్రమణలు తొలగిస్తున్నాం



అమృత్ సరోవర్ పథకం కింద అభివృద్ధి చేసేందుకు ఎంపికచేసిన చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నాం.మండలంలో నాతవరం పంచాయతీలో చెర్లోపాలెం ఉన్న చెరువులో ఆక్రమణలు తొలగించి, అభివృద్ధి చేశాం.

– హనుమంత జయరాం, ఆర్డీవో నర్సీపట్నం

మార్చిలో రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు

అనకాపల్లిటౌన్ : స్థానిక వీవీ రమణ రైతుభారతి హాలులో మార్చి 20, 21, 22 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఆహ్వానపు నాటిక పోటీలను ప్రదర్శించనున్నట్టు జ్యోతిసరళ స్మారక కళాపరిషత్ సభ్యుడు వీసీహెచ్ నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాటిక పోటీలను కుటుంబ సమేతంగా వీక్షించి, ఆదరించాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు.

గడ్డి ట్రాక్టరు దగ్ధం

కోటవురట్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. కాకినాడ జిల్లా ఎస్‌ఆర్ పేట నుంచి రైతు సుర్ల బ్రహ్మ గడ్డిని కొనుగోలు చేసి నర్సీపట్నం మండలం అమలాపురాని ట్రాక్టర్‌లో తరలిస్తుండగా ఆక్సాహేబుపేట వద్దకు వచ్చేసరికి విద్యుత్ తీగెలు తగలడంతో షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ తొట్టి, గడ్డి కాలిపోయాయి. సుమారు రూ.15 వేలు నష్టం వాటిల్లినట్టు రైతు బ్రహ్మ తెలిపారు.

బురదలో కూరుకుపోయి రైతు మృతి

మునగపాక : మండలంలోని కుమారపురం గ్రామానికి చెందిన రైతు దోసపాత్రుని సత్యనారాయణ(52) పొలానికి నీరు పెట్టి వస్తుండగా మట్టిలో జారిపడి మృతి చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. మృతుడు సత్యనారాయణ సోమవారం రాత్రి వరి నాట్లకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో నాట్లు వేసిన పొలంలోని బురదలో జారిపడిపోయాడు. పొలానికి వెళ్లిన భర్త ఇంటికి రాకపోవడంతో కంగారుపడ్డ కుటుంబ సభ్యులు ఇతరుల సహకారంతో పొలం వద్దకు వెళ్లి చూడగా బురదలో కూరుకుపోయి మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో సత్యనారాయణ కుటుంబ సభ్యులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న మునగపాక పోలీసులు మంగళవారం సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. మృతుడు సంజీవరావుకు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

ఆసక్తికరం.. ఆలోచనామృతం

- విశేషంగా ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్
- నాలుగువేల మందితో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: దేశభక్తి, స్వాతంత్య్ర సమర ఘట్టాలు, గాంధీజీ జ్ఞాపకాలు, వాతావరణ పరిరక్షణ, ప్రభుత్వ పథకాలు.. ఇలా ఎన్నో విషయాలపై ప్రదర్శించిన ఫొటో ఎగ్జిబిషన్ అలరించింది. ఆసక్తి గొలిపింది. విద్యార్థులను ఆలోచింపజేసింది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల ఫొటో ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది. తొలుత నాలుగు వేల మంది విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి ఆర్డీవో హెచ్.వి.జయరాంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై ఇలాంటి ఫొటో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆర్డీవో జయరాం, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ సహాయ సంచాలకుడు షఫీ మహమ్మద్ మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణి దేవి, మున్సిపల్ కమిషనర్ కనకారావు, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, కర్రి చైతన్య, అన్నపూర్ణ, ధనిమిరెడ్డి ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు



వాలీబాల్ క్రీడాకారులతో సీఐ



పోటీలో తలపడిన యానాం, శ్రీకాకుళం జట్లు

చోడవరం రూరల్: మండలంలోని గోవాడలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఇక్కడ పరదేశమ్మ పండగ సందర్భంగా గోవాడ, అంభేరుపురం స్వామ్ బోయ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను మంగళవారం చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి పండగ, తీర్థాల్లో ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల జట్లతోపాటు పాండిచ్చేరి జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఎస్‌ఐ బి.అప్పలనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక వెంకట సత్యారావు, గోవాడ మాజీ సర్పంచ్ ఏడువాక వెంకట లక్ష్మణకుమార్ తదితరులు క్రీడాకారులను అభినందించారు. ప్రారంభ పోటీలో యానాంపై శ్రీకాకుళం జిల్లా జట్టు విజేతగా నిలిచింది.

అవిగో ఆర్థిక సంఘం నిధులు!

- ఉమ్మడి విశాఖ జిల్లాకు రూ.8.50 కోట్లు విడుదల
- 42 జెడ్పీటీసీలు, 13 ఎమ్మెల్యేలు..
- వీరికి రూ.13 లక్షల చొప్పున కేటాయింపు
- ఈ నిధులతో మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ పనులు
- అంచనాల తయారీలో అధికారులు
- రూ.కోటితో జెడ్పీ కార్యాలయం, గెస్ట్ రూమ్‌లకు మరమ్మతులు



విశాఖలోని జిల్లా పరిషత్ కార్యాలయం

సాక్షి, విశాఖపట్నం: కొన్నాళ్లుగా ఊరిస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చేశాయి. ఉమ్మడి విశాఖ జిల్లాకు రూ.8.50 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులను జిల్లా పరిషత్ పరిధిలోకి వచ్చే 42 మంది జెడ్పీటీసీలు, 13 మంది ఎమ్మెల్యేలకు రూ.13 లక్షల చొప్పున కేటాయించారు. వీటితో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని మంచినీరు, సిమెంట్ కాంక్రీట్ రోడ్లు, డ్రెయినేజీలకు అవసరమైన పనులు చేపట్టనున్నారు. ఇంకా ఎక్కడైనా అవసరమైతే కొత్తగా రోడ్ల నిర్మాణానికి కూడా వెచ్చించనున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల సమాచారాన్ని జిల్లా పరిషత్ అధికారులు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారుల (ఎంపీడీవోల)కు పంపించారు. ఈ ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సదరు పనులకు అంచనాల తయారీలో ఉన్నారు. నిబంధనల ప్రకారం అంచనాలు రూపొందించి పంపిస్తారు. అనంతరం పనులు చేపడతారు. ఈ పనులు మొదలైతే మార్చి నాటికల్లా పూర్తవుతాయని భావిస్తున్నారు.

జెడ్పీ కార్యాలయానికి మరమ్మతులు

మరోవైపు జిల్లా పరిషత్ కార్యాలయం, ఆ ప్రాంగణంలో ఉన్న ఎనిమిది గెస్ట్ రూమ్‌లు చాన్నాళ్లుగా మరమ్మతులకు గురయ్యాయి. ఈ గెస్ట్ రూమ్‌లు చాలా వరకు వినియోగానికి పనికి రాకుండా ఉన్నాయి. ఈ నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోటితో జెడ్పీ కార్యాలయం, గెస్ట్ రూమ్‌లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టనున్నట్టు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర 'సాక్షి'తో చెప్పారు.

జనరల్ ఫండ్ నుంచి రూ.12 కోట్లు

ఇప్పటికే గత ఏడాది జిల్లా పరిషత్ సాధారణ నిధుల (జనరల్ ఫండ్) నుంచి జెడ్పీటీసీలు, ఎమ్మెల్యేలకు రూ.12 కోట్లు విడుదల చేశారు. ఇలా జెడ్పీటీసీలకు రూ.15 లక్షలు, ఎమ్మెల్యేలకు రూ.50.20 లక్షల చొప్పున కేటాయించారు. వీటితో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. తాజాగా ఇప్పుడు విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులతో ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో అవసరమైన పనులు చేపట్టడానికి సన్నద్ధమవుతున్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లిటౌన్ : టాటా ఏస్ వ్యాన్‌లో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ దివాకర్ తెలిపారు. వివరాలు.. పట్టణంలోని గవరపాలెం సత్తెమ్మతల్లి ఆర్చ్ వద్ద పట్టణ పౌర సరఫరాల శాఖ ఆర్‌ఐ ఈశ్వరరావు మంగళవారం రాత్రి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకుని పట్టణ పోలీసులకు అప్పగించారు. వ్యాన్‌తోపాటు 1,400 కిలోల రేషన్ బియ్యంను స్వాధీన చేసుకున్నారు. ఆర్‌ఐ ఈశ్వరరావు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

బై..బై.. వైజాగ్



అభిమానులతో సందడి చేస్తున్న అల్లు అర్జున్

కొమ్మాది: స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ విశాఖకు బై బై చెప్పారు. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న పుష్ప–2 (ది రూల్) సినిమా షూటింగ్ కోసం గత నెల 20న ఆయన వైజాగ్ వచ్చారు. ఫిషింగ్ హార్బర్, పోర్టు, అప్పుఘర్ ప్రాంతాల్లో 18 రోజుల పాటు నిర్విరామంగా సినిమా చిత్రీకరణలో పాల్గొన్నారు. మంగళవారం గాదిరాజు ప్యాలస్, రుషికొండలోని రాడిసన్ బ్లూలో అభిమానులతో ఫొటోషూట్ నిర్వహించారు. ఆ సమయంలో నగరానికి చెందిన ఓ దివ్యాంగుడు అల్లు అర్జున్‌ను కలిసేందుకు వచ్చారు. ఇది గమనించి అల్లు అర్జున్ ఆ దివ్యాంగుడిని ఎత్తుకుని ఫొటో దిగారు. సాయంత్రం ఆయన తిరిగి హైదరాబాద్ పయనమయ్యారు.

చెరకు రైతులకు మేలుచేసేలా పరిశోధనలు

- సోలాపూర్ మహాత్మాపూలే కృషి విద్యాపీఠం(ఆర్‌ఏఆర్‌ఎస్) శాస్త్రవేత్తలు
- అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్‌ను సందర్శించిన బృందం



ఏడీఆర్ జగన్నాథరావుతో సోలాపూర్ శాస్త్రవేత్తలు

అనకాపల్లిటౌన్: చెరకు రైతులకు మేలు జరిగే విధంగా పలు రకాల పరిశోధనలు చేస్తున్నట్టు మహారాష్ట్ర రాష్ట్రంలో సోలాపూర్ మహాత్మాపూలే కృషి విద్యాపీఠం(ఆర్‌ఏఆర్‌ఎస్) శాస్త్రవేత్తలు డాక్టర్ విద్యాసాగర్, గోవింద్, బాపూరావ్ గైక్వాడ్ తెలిపారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానాన్ని మంగళవారం వారు సందర్శించి, బెల్లం తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపొడిని తయారు చేసే కేంద్రాన్ని పరిశీలించినట్టు చెప్పారు. సోలాపూర్ పరిశోధనా కేంద్రంలో రూ.2.16 కోట్లతో మోడరన్ జాగ్రి ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా బెల్లం పౌడర్, లిక్విడ్ బెల్లాన్ని అధికంగా తయారు చేస్తూ ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్టు తెలిపారు. లిక్విడ్ బెల్లం సుమారు పది నెలలు, బెల్లం పౌడర్ ఏడాది పాటు నిల్వ ఉంటుందన్నారు. మహారాష్ట్రలో కోఆపరేటివ్ సంస్థలు 177 ఉన్నాయని వారు చెప్పారు.

రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో సూపర్‌కాన్ హార్వెస్టర్ అనే కొత్త యంత్రాన్ని రూ.1.20 కోట్ల వ్యయంతో తయారు చేశారని, గతంలో అక్కడి యంత్రాలను తాము పరిశీలించామని చెప్పారు. బెల్లం సీజన్ నవంబర్ నుంచి మార్చి వరకూ ఉంటుందని, ఈ సీజన్‌లో తయారు చేసే బెల్లాన్ని ఏడాది పాటు నిల్వ ఉంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. మహారాష్ట్రలో ఎకరాకు 50 టన్నుల చెరకు దిగుబడి అవుతుండగా, ఏపీలో 25 నుంచి 30 టన్నులు మాత్రమే ఉత్పతి అవుతోందన్నారు. వీరితో పాటు అనకాపల్లి మోడరన్ జాగ్రిప్లాంట్‌ను ముంబై ఐఐటీ శాస్త్రవేత్తలు ప్రమోద్‌గడ్కరీ, విశ్వంబర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ జగన్నాథరావు మాట్లాడుతూ దేశంలో బెల్లం ఉత్పత్తి ప్రథమస్థానంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఉందని, తర్వాత స్థానంలో ఏపీ ఉన్నట్టు చెప్పారు.

క్లీన్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా..

- నక్కపల్లి శిక్షణ కేంద్రంలో ట్రయల్‌రన్
- డెమో కార్యక్రమం ప్రారంభించిన జెడ్పీ సీఈవో
- దశలవారీగా 645 పంచాయతీల సిబ్బందికి శిక్షణ



తడి చెత్తను సంపద తయారీ కేంద్రంలో కుండీల్లో వేసే కార్యక్రమం ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి



తడి చెత్తను సంపద తయారీ కేంద్రంలో కుండీల్లో వేసే కార్యక్రమం ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి

నక్కపల్లి: క్లీన్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరుతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను, కార్యదర్శులను భాగస్వాములను చేసి శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలో నక్కపల్లి, మునగపాక మేజర్ పంచాయతీలను ఎంపిక చేసింది. మొదటి విడతలో శిక్షణకు సంబంధించి నక్కపల్లి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ట్రయల్ రన్‌ను ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సీఈవో పి.శ్రీరామమ్మూర్తి, సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ కార్యక్రమం జిల్లా సమన్వయకర్త నాగలక్ష్మి కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ముందుగా కేంద్రం వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో మాట్లాడుతూ పారిశుధ్య సమస్య లేకుండా గ్రామాలను అందంగా తీర్చిదిద్దాలని, చెత్త నుంచి సంపద తయారీ చేయడానికి చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలన్నారు. జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి మాట్లాడుతూ శిక్షణ కోసం నక్కపల్లి, మునగపాక పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యూపీసీలను ఎంపిక చేశామన్నారు. 12 మండలాల చొప్పున మునగపాక, నక్కపల్లిలో శిక్షణ ఇస్తామన్నారు. దశలవారీగా 645 పంచాయతీలకు ఈ శిక్షణ అందిస్తామన్నారు. ముందుగా ప్రతి మండలంలోను రెండు పంచాయతీలను మోడల్‌గా ఎంపిక చేసి అక్కడ ప్రజాప్రతినిధులకు సిబ్బందికి శిక్షణ ఇచ్చి వారి ద్వారా మిగిలిన పంచాయతీలన్నింటికి శిక్షణ ఇస్తామన్నారు. త్వరలోనే శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీలు, గ్రీన్ అంబాసిడర్లతో కలసి నక్కపల్లిలో ఇళ్లకు వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించారు. ఊరి చివరన చెత్తకుప్పల నుంచి చెత్తను సేకరించారు. దాన్ని వర్మీ కంపోస్టు తయారు చేయడం, జంతు కళేబరాలను పూడ్చిపెట్టడం, పొడిచెత్తను, భవన నిర్మాణంలో వచ్చిన వేస్ట్‌ను, సింగిల్ యూజ్‌డ్ ప్లాస్టిక్ సామగ్రిని ఏయే కార్యక్రమాలు నిర్వహించాలనే దానిపై శిక్షణ ఇచ్చారు. నర్సీపట్నం డీఎల్‌పీవో ఎస్ఎస్ మూర్తి, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఎంపీడీవో సీతారామరాజు, నక్కపల్లి, మునగపాక ఈవోపీఆర్డీలు వెంకటనారాయణ, ఈశ్వరరావు, సర్పంచ్‌లు నేతల జయరత్నకుమారి, అప్పారావు, ఉప సర్పంచ్ వీసం రాజు, కార్యదర్శి రాజశేఖర్, రెండు మండలాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న గౌతమి సాలి

అనకాపల్లి టౌన్: విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోను కాకుండా చూడాలని అధ్యాపకులకు ఎస్పీ గౌతమి సాలి సూచించారు. విద్యాసంస్థల యజమానులు, ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లతో తన కార్యాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రచార వాహనం ద్వారా జిల్లాలో విద్యా సంస్థల వద్ద పోక్సో చట్టం, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, మాదకద్రవ్యాల వినియోగం, సైబర్‌క్రైం, ట్రాఫిక్ తదితర అంశాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తున్నట్టు చెప్పారు. స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు నరసింహారావు, చంద్రశేఖర్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మ పండగ

చోడవరం: మండలంలోని 14గ్రామాల గ్రామ దేవత పరదేశమ్మ అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. గోవాడ, దుడ్డుపాలెం, కన్నంపాలెం, రామజోగిపాలెం, బెన్నవోలు, చాకిపల్లి, పీఎస్‌పేట, గంధవరం, కొత్తపల్లితో పాటు పలు గ్రామాల్లో అమ్మవారి పండగను గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దేవాలయంలో అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. గోవాడ సర్పంచ్, చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు ఆధ్వర్యంలో పండగ జరిగింది. పీఎస్‌పేట, గోవాడ, కన్నంపాలెం, చాకిపల్లి గ్రామాల్లో జరిగిన మహోత్సవంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక విద్యుత్ దీపాకాలంకరణ అందర్నీ ఆకట్టుకుంది.

జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్



బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ బృందం సభ్యులతో కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ స్మార్ట్ సిటీస్ నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ బృందానికి జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు వివరించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం కమిషనర్‌ను ఈ బృంద సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా నగరంలో పలు స్కూళ్లు, పార్కులు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులతో పాటు, రోడ్లు, వీధిదీపాలు తదితర అంశాలను కమిషనర్ వారికి వివరించారు. ప్రస్తుతం చేపడుతున్న పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయని, ఇంకా పలు అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు పలు సూచనలు, సలహాలిచ్చారు.

సిటీలో 'దిల్ వాలా' షూటింగ్



రాజేంద్రప్రసాద్‌కు సన్నివేశం వివరిస్తున్న దర్శకుడు వీరభద్రమ్

కొమ్మాది: ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్ మంగళవారం ఆర్.కె.బీచ్ ప్రాంతంలో సందడి చేశారు. డెక్కన్ డ్రీమ్ వర్క్స్ బ్యానర్‌పై దర్శకుడు వీరభద్రమ్ తెరకెక్కిస్తున్న దిల్‌వాలా సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఆయనపై చిత్రీకరించారు. ఆర్.కె.బీచ్‌తో పాటు అక్కడకు సమీపంలోని ఓ గెస్ట్ హౌస్‌లో హీరో నరేష్ అగస్త్యపై కొన్ని సన్నివేశాలు షూట్ చేశారు. క్రైం, కామెడీ కథాంశంతో ఈ సినిమా తెరకెక్కిస్తున్నట్లు దర్శకుడు వీరభద్రమ్ తెలిపారు.

ఎమ్మెల్యే గణేష్ అభ్యర్థనతో ధాన్యం కొనుగోలు



ధాన్యం కొనుగోలుపై ఎమ్మెల్యే గణేష్‌కు వివరిస్తున్న సివిల్ సప్లయి డీఎస్‌వో ప్రసాద్



పి.కె.గూడెంలో ధాన్యం పరిశీలిస్తున్న అధికారులు

- ఇంతవరకు రైతులకు రూ.9.50 కోట్లు చెల్లించాం
- జిల్లా సివిల్ సప్లయి డీఎస్‌వో ప్రసాద్

నాతవరం: కలెక్టరు ఆదేశాల ప్రకారం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ముమ్మరం చేస్తామని సివిల్ సప్లయ్ డీఎస్‌వో ప్రసాద్ అన్నారు. మండలంలోని మాధవనగరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ దృష్టికి కొందరు రైతులు ధాన్యం సమస్య తీసుకొచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సివిల్ సప్లయి డీఎస్‌వో, సీఎస్ డీటీ చంద్రలేఖ, ఇతర అధికారులను రప్పించారు. రైతుల ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం సివిల్ సప్లయి డీఎస్‌వో ప్రసాద్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయమై సోమవారం ఎమ్మెల్యే గణేష్ కలెక్టరును కలిసి సమస్య చెప్పారన్నారు. ఈ మేరకు మండలంలో అన్ని గ్రామాల్లో పర్యటించి రైతుల ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. మిల్లర్ల వద్ద సాంకేతికపరమైన సమస్య ఉంటే వెంటనే పరిష్కరించామన్నారు. ఇంతవరకు జిల్లాలో 380 ఆర్బీకేల ద్వారా 17,927 మెట్రిక్ టన్నుల ధాన్యం 5,502 మంది నుంచి కొనుగోలు చేశామన్నారు. రూ.9.50 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. ఇంకా ధాన్యానికి రూ. 25 కోట్లు రైతులకు చెల్లించేందుకు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. జిల్లాలోనే నాతవరం మండలంలో అధిక విస్తీర్ణంలో ఖరీఫ్ వరి సాగు చేశారన్నారు. దాంతో నాతవరం, ఎం.బి.పట్నం, మన్యపురట్ల, గునుపూడి గ్రామాల్లో రైస్ మిల్లర్లకు ధాన్యం కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇచ్చామన్నారు. మిల్లర్లు రైతులను ఇబ్బందులు పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, సర్పంచ్ సామల చింతల్లి, ఉప సర్పంచ్ సిద్దాబత్తుల సత్యవేణి, గుడపర్తి అచ్చియ్యానాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పోలుపర్తి వెంకటరమణ, ఏవో శైలజ, వెలుగు క్లస్టరు ఏరియా కోఆర్డినేటరు సత్యనారాయణ, ఏపీఎం మర్రి లక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

11, 12 తేదీల్లో గోపాలపురంలో 'గడప గడపకు'

అనకాపల్లిటౌన్ : మండలంలోని గోపాలపురంలో ఈ నెల 11, 12 తేదీల్లో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు



జి.భీమవరంలో ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులు, రైతుల ప్రదర్శన

కశింకోట : మండలంలోని జి.భీమవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యతివ్వాలని కోరుతూ విద్యార్థులు, రైతులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. భూమి ఆరోగ్యవంతంగా ఉండటానికి, ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తుల సాగుకు ప్రకృతి వ్యవసాయమే సరైన పద్ధతని పేర్కొన్నారు. భూమి సారవంతం కావడానికి 30 రకాల విత్తనాలు, నవ ధాన్యాలు రుతు పవనాలకు ముందు నాటాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.చిన్నోడు, వీఆర్వో సూర్యనారాయణ, ఎంసీఆర్‌పీ డి.రమణ, ఉపాధ్యాయులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గనుల శాఖ అధికారిని నియమించాలి

అనకాపల్లిటౌన్ : అనారోగ్య కారణాలతో నెల రోజులుగా ఖాళీగా ఉన్న జిల్లా గనుల శాఖ అధికారి స్థానంలో తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు మంగళవారం జిల్లా యంత్రాంగాన్ని కోరారు. జిల్లా గనులశాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారి ఆరోగ్యం క్షీణించడంతో విశాఖ ప్రైవేట్ ఆస్పత్రిలో నెల రోజులుగా చికిత్స పొందుతున్నారు. సదరు అధికారి ఈ నెల 20వ తేదీ వరకూ మెడికల్ లీవ్‌లో ఉన్నట్లు ఆయన తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నెల రోజులుగా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పనులు జరగట్లేదన్నారు. ఇప్పటికైన జిల్లా కలెక్టర్ స్పందించి అధికారిని నియమించాలని ఆయన కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 8,204 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,500	4,120
మొదటి రకం	3,300	3,670
రెండో రకం	3,110	3,420
మూడో రకం	2,900	3,100

అనకాపల్లి సినిమాలు

మైఖేల్	- రాజా
బుట్ట బొమ్మ	- సత్యనారాయణ స్క్రీన్-1
పఠాన్	- సత్యనారాయణస్క్రీన్-2
రైటర్ పద్మభూషణ్	- షిర్డిసాయి
పఠాన్	- పర్తిసాయి
వీరసింహారెడ్డి	- వెంకటేశ్వర
హంట్	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 111 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు , బీ పాజిటివ్-56 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-37 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధిచేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 425 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 382 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

మ్యాపింగ్‌తో కుటుంబ 'సంక్షేమం'

- సవరించాలని సచివాలయాలకు ఆదేశాలు
- మండలంలో వెయ్యికిపైగా కుటుంబాలకు ప్రయోజనం



కుటుంబ వివరాలు సేకరిస్తున్న వలంటీర్



కొత్తూరు సచివాలయం

అనకాపల్లి రూరల్ : సంక్షేమ పథకాలకు కీలకమైన కుటుంబ మ్యాపింగ్(హౌస్‌హోల్డ్ మ్యాపింగ్)లో మార్పులు చేర్పులకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. కుమారుడు, కుమార్తె వివాహమై వేరుగా ఉంటున్నప్పటికీ, తల్లిదండ్రులతో పాటు వారిని ఒకే కుటుంబంగా భావిస్తూ ఇప్పటి వరకూ లబ్ధిదారులను ఎంపిక చేశారు. దీంతో కొందరు సంక్షేమ లబ్ధికి దూరం కావాల్సి వచ్చింది. సంక్షేమ పథకాలకు నిర్వహిస్తున్న ఆరంచెల తనిఖీల్లో భాగంగా కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరి పేరున ఆస్తులు, వాహనాలు ఉన్నాయన్న కారణంతో ప్రభుత్వ పథకాలకు వారిని అనర్హులుగా ప్రకటించేవారు. ఇలాంటి వారికి లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం సచివాలయాలకు మార్గదర్శకాలు జారీ చేసింది.

2019లో తొలిసారి సర్వే

రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల అమలులో కుటుంబ మ్యాపింగ్ విధానాన్ని పాటిస్తోంది. దాని ఆధారంగానే సామాజిక భద్రతా పింఛన్లు, వైఎస్సార్ చేయూత, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా, జగనన్న అమ్మఒడి, వాహన మిత్ర తదితర పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేస్తోంది. గత టీడీపీ పాలనలో ప్రజా సాధికార సర్వే పేరుతో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేశారు. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామ, వార్డు వలంటీర్లను నియమించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సర్వే చేసి, కుటుంబసభ్యుల వివరాలు(హౌస్‌హోల్డ్ మ్యాపింగ్)సేకరించి, వారంతా ఓ కుటుంబంలా నమోదు చేశారు. కుమారుడు, కుమార్తెలకు వివాహం జరిగి వేరుగా ఉంటున్నా ఒకే రేషన్/బియ్యం కార్డు ఉండటం, రేషన్/బియ్యం కార్డులు వేర్వేరుగా ఉన్నా వారంతా ఒకే ఇంటిలో నివాసం ఉండటంతో ఒకే కుటుంబంలా భావించి మ్యాపింగ్ చేశారు. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న కుటుంబ సభ్యులను కూడా ఒకే కుటుంబంగా పేర్కొన్నారు. అలాంటి వారిలో చాలా మంది సంక్షేమ పథకాలకు దూరమయ్యారు.

ఇన్నాళ్లూ సవరణలకు అవకాశం లేకనే..

కుటుంబ మ్యాపింగ్ తర్వాత మార్పులు, చేర్పులకు అవకాశం ఇవ్వకపోవడంతో సమస్యలు తలెత్తాయి. దీనిని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేయాలన్న లక్ష్యంతో అర్హులైన లబ్ధిదారులందరికీ పథకాలు అందేలా సవరణలకు అవకాశం ఇచ్చింది. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా నాలుగు చక్రాల వాహనం కలిగి ఉన్నా, ఐటీ రిటర్నులు దాఖలు చేస్తున్నా, పరిమితికి మించి ఇంటి స్థలం, అధిక విద్యుత్ బిల్లులు తదితర కారణాలతో అర్హత లున్నా.. సంక్షేమ పథకాలకు ఆటంకాలేర్పడేవి. కొత్తగా ఉద్యోగాలు సాధించిన సచివాలయ ఉద్యోగుల తల్లిదండ్రులకు కూడా ఇప్పటి వరకూ సమస్యలు వచ్చాయి. ఆ క్రమంలో మ్యాపింగ్‌లో సవరణలకు ఎంతో మంది ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ మ్యాపింగ్‌లో సవరణలకు అవకాశం ఇవ్వడం పట్ల పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ లబ్ధికి మార్గం సుగమం

మండలంలో 26 సచివాలయాల్లో సుమారు 270 మందికి పైగా సచివాలయ ఉద్యోగులున్నారు. వీరిలో అధిక శాతం మందికి గత మూడేళ్లలో వివాహాలై వేరుగా వుంటున్నారు. వారి తల్లిదండ్రులు, సోదరులకు ఈ కారణంగా పథకాలు నిలిచిపోయాయి. కుమార్తెకు పెళ్లై అత్తవారింటికి వెళ్లినా, తల్లిదండ్రులకు రేషన్‌కార్డు, పింఛన్లు అందించడానికి వీలుకలగలేదు. అలాంటి వారు ప్రస్తుతం భర్త కుటుంబంలో మ్యాపింగ్ చేసుకునే అవకాశం ఉండడంతో పాటు రికార్డుల పరంగా తల్లిదండ్రుల కుటుంబం నుంచి పూర్తిగా బయటకు వచ్చే అవకాశం లభించింది. ప్రస్తుత సవరణల వల్ల మండల వ్యాప్తంగా సుమారు వెయ్యి వరకు కుటుంబాలకు మేలు జరగనుంది. కుటుంబ మ్యాపింగ్‌లో సవరణలకు అవకాశం ఇవ్వడంతో మండలంలో గ్రామ, వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వారి పరిధిలో సర్వేచేసి, సవరించడంలో నిమగ్నమయ్యారు.

సచివాలయాలను సంప్రదించాలి



కుటుంబ మ్యాపింగ్‌లో మార్పులు, చేర్పులకు సచివాలయాలను సంప్రదించాలి. వివాహమైన వారు భర్త కుటుంబంలోకి వెళ్లాలన్నా, వేరుగా మ్యాపింగ్ చేయించుకోవాలన్నా, వివాహ ధ్రువీకరణ పత్రం అందజేసి మార్పులు చేసుకోవచ్చు. ప్రభుత్వం సూచించిన ఆరు పత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పిస్తే చాలు. లబ్ధిదారుల ఎంపికకు కుటుంబ మ్యాపింగ్ కీలకం. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలి.

– కె.ధర్మారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో, అనకాపల్లి

సకాలంలో సంక్షేమ పథకాలు



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్ : సచివాలయం ఉద్యోగులు రథసారథులుగా విధులు నిర్వహించి ఉన్నతస్థాయి అధికారులు, ప్రజల మన్ననలు పొందాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు సూచించారు. మండలంలోని చింతనిప్పుల అగ్రహారం సచివాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సకాలంలో రావాలని, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు సకాలంలో అందజేయాలని కోరారు. పథకాలు అందజేయడంలో ఎక్కడైనా జాప్యం జరిగినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచి, దోమలు నిర్మూలనకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కె.ధర్మారావు, గ్రామ సర్పంచ్ కొల్లిమల్ల గోవిందరావు, ఎంపీటీసీ కోరుకొండ అచ్చియ్యమ్మ, సచివాలయం కార్యదర్శి అరుణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

గృహసారథులతో ప్రజల వద్దకే పాలన



సమావేశంలో మాట్లాడుతున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. 81వ వార్డు పరిధిలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ఈ వ్యవస్థ ద్వారా అమ్మఒడి, వసతిదీవెన, జగనన్న పెన్షన్, విద్యాదీవెన, రైతునేస్తం తదితర ఎన్నో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అందిస్తున్నట్టు తెలిపారు. ఒక్కో వలంటీర్ పరిధిలో కన్వీనర్లు, గృహసారథులను నియమించి ప్రజల వద్దకే సుపరిపాలన అందేలా చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. గృహసారథుల ద్వారా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, వార్డు ఇన్‌చార్జి రాంబాబు, పార్టీ నేతలు కొణతాల మురళీకృష్ణ, యల్లపు చంద్రమోహన్, కాండ్రేగుల శ్రీరాం, శిలపరశెట్టి బాబీ, కోరుబిల్లి ఆరుద్ర, ప్రసాద్, మళ్ల రామచంద్రరావు, సూరిశెట్టి శివాజీ, దాడి హేమకుమార్, శెట్టి సౌజన్య పాల్గొన్నారు.

ఘనంగా నల్లమారమ్మ జాతర



దాడి రత్నాకర్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి రూరల్ : స్థానిక బీఆర్‌టీ కాలనీ, రామాపురం, రామభద్రపురం కాలనీల్లో మంగళవారం నల్లమారమ్మతల్లి జాతర అత్యంత వైభవంగా జరిగింది. జాతర కోసం ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. నిర్వాహకులు ఆయన్ని సాదరంగా ఆహ్వానించి, సత్కరించారు. ఈ వేడుకల్లో శిలపరశెట్టి బాబీ, సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న వరహాలబాబు, మేడిశెట్టి సత్తిబాబు, దొడ్డిరమణ, ఎంపీటీసీ మొల్లేటి శివాజీ, దాడి రాము, పొలిమేర మణి, పరమేష్, నాయుడు, రమేష్, ఎంపీటీసీ సంతోష్‌కుమారి, సచివాలయ కన్వీనర్ బొట్టా సతీష్, ఆలయ కమిటీ చైర్మన్ జ్యోతుల గణేష్, మాజీ ఎంపీటీసీ కోన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధికి తీర్మానం



ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీపీ, కమిటీ సభ్యులు

అనకాపల్లి రూరల్ : తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, రోగులకు సదుపాయాలు కల్పించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ తీర్మానించింది. ఈ మేరకు మంగళవారం ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, స్థానిక నేతలతో కమిటీ సభ్యులు చర్చించారు. ఆపరేషన్ థియేటర్‌లో పాడైన ఇన్వర్టర్‌ను బాగు చేయడం, ప్రవేశద్వారానికి ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆస్పత్రికి వచ్చే ఇన్‌పేషెంట్ల కోసం రేకుల షెడ్లు నిర్మించాలని తీర్మానించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల ఆప్యాయత కనబర్చి సకాలంలో వారికి వైద్య సేవలందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.వాణి జగదీశ్వరి, ఎంపీడీవో కె.ధర్మారావు, తుమ్మపాల సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి చంద్రశేఖర్, ఎంపీటీసీ పన్నీరు వెంకటలక్ష్మి, పంచదార్ల కన్నారావు, వద్దాది భారతి, అశోక్, కనుబుద్ది శంకరరావు, పీలా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలి

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో కాంట్రాక్టు సిబ్బందికి, సెక్యూరిటీ గార్డులకు నాలుగు నెలలుగా బకాయిపడ్డ జీతాలు తక్షణమే చెల్లించాలని సీపీఎం డివిజన్ నాయకుడు ఎ.బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వివిధ విభాగాల్లో 21 మంది 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని, ఈ ఏడాది సంక్రాంతి సమయంలో కూడా జీతాలు రాక, ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. వైద్యాలయంలో ఆరోగ్య శ్రీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి మూడు మాసాలుగా జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వ అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని కార్మికులకు జీతాలు చెల్లించాలని కోరారు.

రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రి



వాడచీపురుపల్లి-ముత్యాలమ్మపాలెం రహదారిలో వేసిన ఇసుక గుట్ట

పరవాడ: పలు గ్రామాల్లో రహదారులపై ఇష్టానుసారంగా వేస్తున్న భవన నిర్మాణ మెటీరియల్‌తో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన భవనాల నిర్మాణానికి అవసరమైన ఇసుక, రాయి, ఇటుక, పిక్క తీసుకువచ్చి రహదారులపై నిల్వ చేయడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాడచీపురుపల్లి–ముత్యాలమ్మపాలెం రహదారిలో సిమ్మన్నగారి దొడ్డి వద్ద నడిరోడ్డు పై వేసిన ఇసుక గుట్ట ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు, కార్మికులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డుపై వేసిన ఇసుక గుట్ట చెల్లాచెదురుగా మారడంతో రహదారిలో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలు ఇసుకలో జారిపోయి ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లను భవన నిర్మాణ మెటీరియల్‌కు ఉపయోగిస్తున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎన్‌ఏవోబీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

అనకాపల్లి రూరల్ : రాంబిల్లి ఎన్‌ఏవోబీ మెయిన్ గేట్ వద్ద గత 100 రోజులుగా ధర్నా చేస్తున్న నిర్వాసితుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదరి కె.లోకనాథం డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు అధికారపార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలని సూచించారు. స్థానిక పరిశ్రమల్లో 75 శాతం ఉపాధి స్థానికులకే కల్పించాలని డిమాండ్ చేశారు. పలు దఫాలుగా అధికారులతో జరిగిన చర్చల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేసి, జెట్టీ నిర్మించే వరకూ శారదా, వరాహ నదుల్లో చేపల వేటకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఎన్‌ఏవోబీ నిర్వాసితుల కాలనీలో తాగునీరు, వీధిలైట్లు, రహదారులు, పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మేజర్ అయిన పిల్లలకు పూర్తి స్థాయిలో ప్యాకేజీ ఇవ్వాలన్నారు. పంట పొలాలు ముంపునకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల న్యాయమైన పోరాటానికి సీపీఎం సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు.

ఆక్రమణలపై విచారణ

అనకాపల్లిటౌన్ : స్థానిక పూల్‌బాగ్ రహదారిలో ఆక్రమణలపై సచివాలయ అడ్మిన్ చిన్నబ్బాయి, ప్లానింగ్ కార్యదర్శి సాయికిరణ్‌లు మంగళవారం విచారించారు. ఆక్రమణలతో రహదారి కుదించుకుపోతోందంటూ ఆ ప్రాంత రైతుల ఫిర్యాదు మేరకు సచివాలయ అధికారులు అక్రమ నిర్మాణాలు గుర్తించారు. ఏ మేర ఆక్రమణ జరిగిందో పూర్తిగా తెలియాలంటే మండల సర్వేయర్‌ను సంప్రదించాలని అధికారులు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సబ్బవరం, పరవాడ మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో లలిత్ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదోతరగతి పరీక్షలో ఉత్తీర్ణులై 01-07-2022 నాటికి 21 నుంచి 35 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. స్థానికంగా ఉండే వివాహమైన మహిళలై ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో లేదా రిజిస్టర్ పోస్టులో అందజేయవచ్చన్నారు.

మండలం	పంచాయతీ	అంగన్‌వాడీ కేంద్రం	రిజర్వేషన్
సబ్బవరం	వంగలి	వంగలి-2	ఎస్సీ
సబ్బవరం	తవ్వవానిపాలెం	తవ్వవానిపాలెం-2	ఎస్సీ
సబ్బవరం	అమృతపురం	అమృతపురం-2	ఎస్సీ
సబ్బవరం	అమృతపురం	నూరెడ్డిపాలెం	ఎస్సీ
పరవాడ	వాడచీపురపల్లి	దళాయిపాలెం	ఎస్సీ

భూసారం ఆధారంగా పంట సాగుతో మేలు



వరి సాగు చేసే రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

మునగపాక : విత్తన శుద్ధి ద్వారా తెగుళ్లను నివారించవచ్చని అనకాపల్లి రైతు శిక్షణా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భవాని అన్నారు. మండలంలోని వాడ్రాపల్లి ఆవ ప్రాంతంలో వరి పైరును మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి సాగులో జాగ్రత్తలు పాటించాలన్నారు. వరిలో జింక్ లోపం ఉన్నట్లు గుర్తించామని నివారణకు గాను లీటరు నీటిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే ఎకరాకు కార్బోఫ్యూరాన్ గుళికలు(3 గ్రాములు) పది కిలోల పొడి ఇసుకలో కలిపి వెదజల్లాల్సిందిగా సూచించారు. అలాగే భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలు వేసుకోవాలని డాట్ సెంటర్ ఏవో విజేత కోరారు. కార్యక్రమంలో వాడ్రాపలి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, వీఏఏ తులసి, రైతులు రామజోగినాయుడు, సోమేశ్వరరావు, సన్యాశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

కశింకోట : కశింకోటలోని రైతు భరోసా కేంద్రం ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మంగళవారానికి సుమారు ఆరు టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు బియ్యం మిల్లర్లకు బ్యాంకు హామీ లేకపోవడం వల్ల ధాన్యం కొనుగోలులో కాస్త జాప్యం జరిగింది. ఇప్పుడు బ్యాంకు హామీ ఇవ్వడంతో కొనుగోళ్లు ప్రారంభించారు. ఇక ధాన్యం సేకరణ ఊపందుకోనుందని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు.

'ప్రభుత్వ భూమిలో అక్రమాలు'

అనకాపల్లి టౌన్: కశింకోట మండలంలో ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పరుచూరి భాస్కరరావు ఆరోపించారు. బైపాస్ రహదారిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ అవకతవకలను త్వరలో బహిర్గతం చేస్తానని చెప్పారు.

ఘనంగా జువ్వాలమ్మ పండగ

మునగపాక : మండలంలోని గంటవానిపాలెంలో మంగళవారం జువ్వాలమ్మ పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, పాలసంఘం అధ్యక్షులు కన్నబాబు, సర్పంచ్ కోన వెంకటలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఇంటర్నెట్ వినియోగంలో అప్రమత్తత అవసరం

సబ్బవరం: ఇంటర్నెట్,సామాజిక మాధ్యమాలు వినియోగించే విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం అధ్యాపకుడు బయోలా కిరణ్ అన్నారు. సేఫ్ ఇంటర్నెట్‌డే సందర్భంగా సబ్బవరంలోని డీఎస్ఎన్ఎల్‌యూ విద్యార్థులు మంగళవారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరస్తులు నేరాలకు పాల్పడుతున్నతీరు, అంతర్జాలం,సామాజిక మాధ్యమాల్లో మన భద్రతను నిర్లక్ష్యం చేస్తే ఎదురయ్యే పర్యవశానాలను వివరించారు. ఇంటర్నెట్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై ఆన్‌లైన్‌లో ఎలా ఫిర్యాదు చేయాలో వివరించారు. వీటిపై అదనపు సమాచారం అందించేందుకు లీగల్ టూల్ కిట్లు కూడా పంపిణీ చేశారు.

రోడ్డు మరమ్మతులు ప్రారంభం



మునగపాక వద్ద జేసీబీతో పూడిమడక రోడ్డు మరమ్మతు పనులు

మునగపాక : రాష్ట్ర ఐటీ, వాణిజ్య పన్నుల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇచ్చిన హామీ మేరకు పూడిమడక రహదారి మరమ్మతు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. దీంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల మేర పూడిమడక రోడ్డు మరమ్మతులకు గురైన విషయం తెలిసిందే. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గోతుల్లో పడి కొంతమంది గాయాలపాలయ్యారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఈ ప్రాంతానికి వచ్చిన మంత్రి అమర్‌నాథ్‌కు స్థానికులు రహదారి మరమ్మతులపై మొరపెట్టుకున్నారు. స్పందించిన మంత్రి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి రూ.కోటి మేర నిదులు మంజూరు చేయించారు. దీంతో పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం మునగపాక దరి కోతకు గురైన రహదారిని జేసీబీ సాయంతో సరి చేస్తున్నారు. అలాగే గోతులను పూడ్చేందుకు అవసరమయ్యే చర్యలు చేపట్టారు. దీంతో ఈ మార్గం మీదుగా ప్రయాణం సాగించేవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న మంత్రి అమర్‌నాథ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఘనంగా వీరాంజనేయ స్వామి తీర్థం

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు చినయాతపాలెంలోని శ్రీ వీరాంజనేయస్వామి తీర్థ మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. వేకువ జాము నుంచే చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన దొడ్డి కల్యాణి, కె. శారద, మళ్ల తులసి, షేక్ ఫాతిమాలకు ఉత్సవ కమిటీ సభ్యులు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ శరగడం దుర్గినాయుడు, సభ్యులు మళ్ల బాలాజీ,మళ్ల నాగభూషణం,మళ్ల రాము,శరగడం సత్యనారాయణ, మళ్ల గంగునాయుడు తదితరులు ఉన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన ర్యాలీ



ఆదిరెడ్డిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సబ్బవరం: ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు ఉత్పత్తి చేసుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ జానకి అన్నారు. మండలంలోని సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెంలో ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల మానవాళితో పాటు మూగజీవాలు, పర్యావరణానికి మరింత మేలు కలుగుతుందన్నారు. అలాగే తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన పంట దిగుబడులు అధికంగా సాధించవచ్చని చెప్పారు. ఖరీఫ్ పంటలకు ముందు నవధాన్యాల పంటలు వేయడం గురించి అవగాహన కల్పించారు. 30 రకాల పీఎండీఎస్ విత్తనాలు గురించి రైతులకు తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జె. శ్రీనివాస్, పి.సత్యనారాయణ, కె.శ్రీనివాస్‌తో పాటు రైతులు ఆదిరెడ్డి దుర్గమ్మ, కొటాన సత్యవతి, కొటాన కుమారి, కొటాన లలిత తదితరులు పాల్గొన్నారు.